సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి కృషి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.70 అడుగులు
ఇన్‌ఫ్లో	: 37,953 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 44,870 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,298 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10,200 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,972 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	643.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1825 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 435 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 314.14 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 120.82 క్యూసెక్కులు





విదేశీ రోడ్లపై మనోళ్ల డ్రైవింగ్‌లో రయ్.. రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. చదువు, ఉద్యోగం, పర్యాటకం పేరుతో చాలామంది విదేశాలకు వెళ్తుంటారు. అక్కడ వాహనం నడపాలంటే కచ్చితంగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్(ఐడీపీ) ఉండాలి. విదేశాలకు వెళ్లే వారంతా ఐడీపీ లైసెన్స్‌లు పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ లైసెన్స్‌లు తీసుకునే వారి సంఖ్య పెరుగుతోంది.

లండన్‌లో డ్రైవింగ్ చేస్తున్న సూర్యాపేట వాసి రాజేష్‌కుమార్

విదేశాల్లో మనోళ్లు

రయ్.. రయ్..

- ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం ఇతర దేశాలకు యువత
- చదువు, ఉద్యోగంతోపాటు పార్ట్‌టైం డ్రైవింగ్ చేస్తూ సంపాదన
- ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న ఇంటర్నేషనల్ డ్రైవింగ్ పర్మిట్లు

నల్లగొండ, సూర్యాపేటటౌన్, భువనగిరి టౌన్ : విదేశాల్లో ఎటు వెళ్లాలన్నా కూడా కారు తప్పనిసరి. ఉద్యోగ నిమిత్తం, ఎంఎస్, ఎంబీఏ, ఎంబీబీఎస్ లాంటి ఉన్నత చదువులకు వెళ్లేవారు వేలాది మంది ఉంటారు. ఆయా దేశాలను బట్టి వారానికి రెండు నుంచి మూడు రోజులే కళాశాలలు, ఆఫీస్‌లు ఉండటంతో మిగతా రోజులు పార్ట్‌టైంగా డ్రైవింగ్ చేస్తూ ఉపాధి పొందుతారు. దీంతో ఐదేళ్లుగా ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకునే వారి సంఖ్య పెరిగింది.

అక్కడి లైసెన్స్ పొందాలి..

మనదేశంలో తీసుకున్న ఐడీపీతో దాదాపు 150 దేశాల్లో వాహనాలు నడపవచ్చు. ఇక్కడి ఐడీపీతో విదేశాలకు వెళ్లిన తర్వాత ఆ దేశాన్ని బట్టి ఆరు నెలల నుంచి సంవత్సరం పాటు ఐడీపీ చెల్లుబాటు అవుతుంది. తర్వాత డ్రైవింగ్ చేయాలనుకునే వారు అక్కడి నిబంధనల ప్రకారం లైసెన్స్ పొందాలి. మనదేశంలో లైసెన్స్ పొంది, 3, 4 సంవత్సరాల అనుభవం ఉన్న వారికి విదేశాల్లో లైసెన్స్ త్వరగా వస్తుందని అధికారులు చెబుతున్నారు.

సండే స్పెషల్

ఐడీపీల జారీ సంఖ్య జిల్లాల వారీగా..

సంవత్సరం	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
2016	155	67	నిల్
2017	169	68	27
2018	227	92	47
2019	255	124	60
2020	188	106	46
2021	562	318	103
2022	1030	507	221
2023	1152	632	286
2024	547	304	102

(సెప్టెంబర్ 15వ తేదీ వరకు)

పార్ట్ టైం డ్రైవింగ్ చేస్తా

నేను 2021 నుంచి లండన్‌లో ఉంటున్న. 2023లో ఇక్కడ ఇంటర్నేషనల్ లైసెన్స్ తీసుకున్నా. అది వ్యాలిడిటీ అయిపోవడంతో లండన్‌లోనే ఇంటర్నేషనల్ లైసెన్స్ తీసుకున్నా. వారంలో మూడు రోజులు పార్ట్‌టైంగా డ్రైవింగ్, నాలుగు రోజులు సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తా. మూడు రోజులు డ్రైవింగ్ చేస్తే రూ.45వేలు వస్తే.. నాలుగు రోజులు సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తే రూ.38 వేలు వస్తున్నాయి. ఖర్చులు, రూం కిరాయి, ఇతర ఖర్చులు డ్రైవింగ్ మీదే వెళ్లదీస్తా.



- బి.రాజేష్‌కుమార్

ఏడాది పాటు చెల్లుబాటు అవుతుంది



మన దేశంలో ఇంటర్నేషనల్ లైసెన్స్ తీసుకుంటే విదేశాల్లో ఏడాదిపాటు చెల్లుబాటు అవుతుంది. ఆ తర్వాత మళ్లీ ఇక్కడ తీసుకోవచ్చు. వీలు కుదరకపోతే ఇక్కడి లైసెన్స్‌ను అక్కడ లెర్నింగ్‌గా ఉపయోగించుకోవచ్చు. దీన్ని చూపించి ఆయా దేశాల్లో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

- సురేష్‌రెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి, సూర్యాపేట

ఐడీపీ తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది

విదేశాలకు వెళ్తున్న వారు తప్పని సరిగా ఐడీపీ లైసెన్స్ తీసుకుంటున్నారు. విదేశాల్లో ఈ లైసెన్స్‌ను ప్రామాణికంగా తీసుకుని అక్కడి లైసెన్స్ ఇస్తారు. అంతర్జాతీయ లైసెన్స్‌కు రెన్యువల్ ఉండదు. కాలపరిమితి ముగిస్తే మరోసారి తీసుకోవాల్సిందే.

- సాయికుమార్, డీటీఓ, యాదాద్రి భువనగిరి జిల్లా

ఐడీపీ పొందడం ఇలా..

- వీసా తీసుకున్న తర్వాత ఐడీపీ పొందవచ్చు.
- 18 ఏళ్ల వయస్సు పైబడి ఉండాలి.
- దరఖాస్తు చేసిన తేదీ నుంచి కనీసం ఆరు నెలలపాటు చెల్లుబాటు అయ్యేలా వీసా తప్పనిసరి.
- ఆర్టీఏ వెబ్‌సైట్ లేదా కార్యాలయంలో ఫారం–4ఏ నింపాలి. ఇక్కడి డ్రైవింగ్ లైసెన్సు, ఆరోగ్య ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు, వీసా జిరాక్స్‌లు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఇంటి చిరునామా తెలిపే ఆధార్, కరెంట్ బిల్ జత చేసి, నిర్ణీత రుసుం చెల్లించాలి.
- వెరిఫికేషన్ తర్వాత స్పీడ్ పోస్టులో ఇంటికే ఐడీపీ కార్డు పంపిస్తారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో వయోవృద్ధులకు సేవలందిస్తున్న వయోవృద్ధులు, సంస్థలకు అక్టోబర్ 1 న అందించే పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఏటా అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారు ఈనెల 25 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు హైదరాబాద్ లోని మలక్ పేట నల్లగొండ క్రాస్ రోడ్ లో ఉన్న దివ్యాంగుల సంక్షేమ భవనంలో దరఖాస్తులు అందించాలని కోరారు. అప్లికేషన్ ఫామ్, పురస్కారాల కేటగిరీ కోసం dsc.telanga na.gov.in వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

బీసీ మహిళలు ఉద్యమించాలి

సూర్యాపేటటౌన్ : బీసీ మహిళలు చట్టసభల్లో రిజర్వేషన్ కోసం ఉద్యమించాలని ప్రముఖ న్యాయవాది పూర గాయత్రి, ప్రముఖ కవి, రచయిత దాసోజు లలిత పిలుపునిచ్చారు. 'మహిళా రాజకీయ రిజర్వేషన్ – బీసీ మహిళా కోటా' అనే అంశంపై శనివారం సూర్యాపేటలో నిర్వహించిన జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం గత ఏడాది తెచ్చిన మహిళా రాజకీయ రిజర్వేషన్ చట్టంలో బీసీ కోటా ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. చట్టసభల్లో బీసీ మహిళలకు రిజర్వేషన్ సాధించే వరకూ పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్, వనిత, లక్ష్మీదేవి, ఉపేంద్రబాయి, మారోజు సృజన, దుర్గా రాణి, విజయ, జానకి, గోపి, భవాని పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



తిరుమలగిరి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

తిరుమలగిరి (తుంగతుర్తి) : వైద్య సిబ్బంది సమయ పాలన పాటించాలని జిల్లా వైద్యాధికారి కోటాచలం కోరారు. శనివారం తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. విధులకు హాజరుకాని ఇద్దరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వందన, వైద్య సిబ్బంది ఉన్నారు.

నృసింహుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు కొనసాగాయి. వేకువ జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు జరిపించారు. సాయంత్రం జోడు సేవలను మాడవీధిలో ఊరేగించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

- సాగుతున్న సాగర్ ఎడమ కాలువ గండ్లు పూడ్చివేత పనులు
- ఫలించని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- సాగర్ నీటి కోసం మరో ఐదు రోజులు ఆగాల్సిందే
- ఎండిపోతున్న వరి పొలాలు
- ఆందోళన చెందుతున్న రైతులు

22 రోజులు కావొస్తున్నా..

గండ్లు పూడ్చలే

కోదాడ: నాగార్జున సాగర్ ఎడమ కాలువ పరిధిలోని రైతుల సాగు నీటి కష్టాలు ఇప్పట్లో తీరే సూచనలు కనిపించడం లేదు. గండ్లు పడి 22 రోజులు కావొస్తున్నా మరమ్మతు పనులు ఇంకా కొలిక్కిరావడం లేదు. నడిగూడెం మండలం రామచంద్రాపురం వద్ద , రంగుల బ్రిడ్జి వద్ద పడిన గండ్లను పూడ్చివేసే పనులు పూర్తికావడానికి మరో ఐదు రోజులు పట్టే అవకాశం ఉంది. గండ్లు పూడ్చే వరకు ప్రత్యామ్నాయంగా నడిగూడెం మండలం సిరిపురం వద్ద కాలువకు అడ్డంగా కట్టపోసి అక్కడి వరకు నీరు ఇవ్వాలని నాయకులు చేసిన ప్రయత్నాలు కొందరు రైతులు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయాయి. దీంతో ఇక ఈ రెండు గండ్లు పూడ్చిన తరువాతే సాగు నీరు విడుదల చేసే అవకాశం ఉంది.

పనుల్లో కానరాని వేగం

పాలేరు వైపు వెళ్లే సాగర్ ఎడమకాలువకు నడిగూడెం మండలం రామచంద్రపురం వద్ద ఈ నెల 1వ తేదీన గండి పడగా మరమ్మతు పనులను ఈ నెల 15న ప్రారంభించారు. అప్పటి నుంచి పనులు చేపట్టినప్పటికీ అందులో వేగం కానరావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇదే మాదిరిగా పనులు చేస్తే మరో నాలుగైదు రోజులకు కూడా పనులు పూర్తి అయ్యే సూచనలు కన్పించడం లేదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే వరిపొలాలు పూర్తిగా ఎండిపోతున్నాయని మరో ఐదారురోజులు ఆగితే పంటలపై పూర్తిగా ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు వాపోతున్నారు.



సాగర్ ఎడమ కాలువ రంగుల బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న గండి పూడ్చివేత పనులు



సాగర్ కాలువకింద ఎండిపోతున్న వరిపొలాలు

రంగుల వంతెన వద్ద పనులు ప్రారంభం

మొదట గండి పడిన నడిగూడెం మండలం రామచంద్రాపురానికి కొద్ది దూరంలో ఖమ్మం జిల్లా పరిధిలో రంగుల వంతెన వద్ద మరో గండి పడింది. ఇక్కడ మట్టి కట్టకు వంతెనకు మధ్య గండి పడింది. గండి పడిన అడుగుభాగం పరుపుబండ ఉండడంతో గండి పూడ్చడం సవాలుగా మారింది. ఇక్కడ పనులను మూడు రోజుల క్రితం కాంట్రాక్టర్ మొదలు పెట్టారు. బండకు రంధ్రాలు వేసి దానిలో ఇనుపకడ్డీలు వేసి కాంక్రీట్ వాల్‌పోస్తున్నారు. శనివారం సాయంత్రానికి ఐదు అడుగుల మేర వాల్ పూర్తి చేశారు. దానిపై మరో ఐదు అడుగుల మేర కాంక్రీట్‌వాల్ పోయడానికి సెంట్రింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది పూర్తయిన తరువాత దానికి ఇరువైపులా మట్టికట్ట పోయాల్సి ఉంటుంది. ఇది మొత్తం పూర్తికావడానికి మరో ఐదారురోజులు పట్టే అవకాశం ఉందని కాంట్రాక్టర్లే అంటున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై అభ్యంతరం చెప్పిన రైతులు

గండ్లపూడ్చివేత ఆలస్యం అవుతుండడం.. పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుండడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కొందరు స్థానిక నాయకులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ క్రమంలో రామచంద్రాపురం- సిరిపురం వంతెన వద్ద సాగర్ కాలువలో అడ్డుకట్ట వేసి మునగాల హెడ్ రెగ్యులేటర్ నుంచి సిరిపురం వరకు నీరు ఇవ్వాలని చూశారు. కాలువలో మూడునాలుగు అడుగుల మట్టికట్టపోశారు. ఇది తెలుసుకున్న కింది రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగైదు రోజుల్లో గండిపూడ్చివేత పనులు పూర్తి అవుతున్న తరుణంలో మళ్లీ అడ్డుకట్ట వేస్తే దాన్ని తీయడానికి మరో రెండు రోజులు పడుతుందని, అడ్డుకట్ట వేయవద్దని చెప్పడంతో కట్టపోసే పనులను మధ్యలోనే నిలిపి వేశారు. దీంతో గండ్లు పూడ్చివేత పనులు పూర్తయితే తప్పా నీరు అందేపరిస్థితి కానరావడం లేదు.



సిరిపురం వద్ద సాగర్ కాలువలో అడ్డుగా పోసిన మట్టికట్ట

లోక్ అదాలత్ సభ్యుల నియామకం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ న్యాయస్థానం ఆవరణలో ఈనెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ కోసం సభ్యులను హుజూర్‌నగర్ రెండవ అదనపు జిల్లా ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డి నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. హుజూర్‌నగర్ రెండవ అదనపు జిల్లా కోర్టుకు ప్రిసైడింగ్ అధికారిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్‌రెడ్డి, సభ్యులుగా న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, షేక్ సైదా హుస్సేన్‌లను నియమించారు. అలాగే హుజూర్‌నగర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రిసైడింగ్ అధికారిగా సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్ కుమార్, సభ్యులుగా న్యాయవాదులు కుక్కడపు బాలకృష్ణ, కమతం నాగార్జున, జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ప్రిసైడింగ్ అధికారి గా జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, సభ్యులుగా న్యాయవాదులు చల్లా కృష్ణయ్య, పాలేటి శ్రీనివాసరావులను నియమించారు.

లక్ష్మణ్ బాపూజీకి నివాళి



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం తిరుమలగిరిలోని చేనేత సహకార సంఘం కార్యాలయంలో పద్మశాలి సంఘం, పూలే అధ్యయన వేదిక, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

7.9 మి.మీ సగటు వర్షపాతం నమోదు

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట జిల్లాలో మోస్తరు వర్షం పడింది. శనివారం ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు సరాసరి 7.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రధానంగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుని ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. జిల్లాలో ప్రధానంగా హుజూర్‌నగర్‌లో 32.8 మిల్లీమీటర్లు, కోదాడలో 25.3, చిలుకూరు 23.3, గరిడేపల్లి 21.0, పెన్‌పహాడ్ 19.4, సూర్యాపేట 16.2, నేరేడుచర్ల 14.0 , మఠంపల్లి 12.9, చివ్వెంల 3.9, పాలకవీడు 3.8, ఆత్మకూర్ ఎస్, మద్దిరాల 2.8, అనంతగిరి 1.2, చింతలపాలెం 1.0, తిరుమలగిరి 0.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. పాత చిలుకూరులో పిడుగు పడి కొండ ఎల్లయ్యకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి.



సూర్యాపేటలో వర్షానికి రోడ్డుపై నిలిచిన నీరు

యాదాద్రిలో ఎన్నికల కమిషనర్ పూజలు

యాదగిరిగుట్ట: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని శనివారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, అనంతరం ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత ప్రత్యేక అష్టోత్తర పూజ చేశారు. రాణి కుముదినికి ఆలయ అర్చకులు ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ ఈవో భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదంతో పాటు శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.



ఎన్నికల కమిషనర్ రాణి కుముదినికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో భాస్కర్‌రావు

రెండు రైస్ మిల్లులపై కేసు నమోదు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ప్రభుత్వానికి సీఎంఆర్ (కస్టమ్స్ మిల్లింగ్ రైస్) ఇవ్వని తిరుమలగిరి మండల కేంద్రంలోని రెండు రైస్ మిల్లులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ శనివారం తెలిపారు. కేసుకు సంబంధించి ఎస్‌ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలగిరి మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి ట్రేడర్స్, హర్షిత రైస్ ఇండస్ట్రీస్‌పై సివిల్ సప్లయ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. శ్రీలక్ష్మి ట్రేడర్స్‌లో 2022–23 యాసంగి, 2023–24 వానాకాలంలో 6,634 మెట్రిక్ టన్నుల ధాన్యం అలాట్ అయింది. దీనికి గాను 4,416 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంది. కానీ రూ.23,40కోట్ల విలువైన 6,591 మెట్రిక్ టన్నుల ధాన్యం పక్కదారి పట్టించారు. హర్షిత రైస్ ఇండస్ట్రీకి 2021–22 యాసంగి, 2022–23 యాసంగిలో 8,424 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఈ మిల్లు ద్వారా 3,010 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ప్రభుత్వానికి రావాల్సి ఉంది. కానీ రూ.16.28కోట్లు విలువైన రూ.4,493 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని పక్కదారి పట్టించారు. సివిల్ సప్లయ్ అకౌంటెంట్ కె.బెనర్జి ఫిర్యాదు మేరకు ఈ రెండు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు. ఈ మిల్లులపై దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ అంజయ్య, డీపీఎస్‌ఓ ఈశ్వర్, సివిల్ సప్లయ్ డీటీసీఎస్ కళ్యాణ్ పాల్గొన్నారు.

మాకు రుణమాఫీ ఎందుకు కాలేదు



ఎర్రవరం పీఏసీఎస్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతులు

- ఎర్రవరం పీఏసీఎస్‌లో సిబ్బందిపై రైతుల ఆగ్రహం
- కుర్చీలు కిందపడేసి వాగ్వాదం
- వర్షంలోనే కార్యాలయం ఎదుట నిరసన

కోదాడరూరల్ : 'మాకు రుణమాఫీ ఎందుకు కాలేదు.. రుణాలు తీసుకొని రెండేళ్లవుతున్నా మా పేర్లు ఎందుకు పంపలేదు' అని పలువురు రైతులు శనివారం కోదాడ మండలం ఎర్రవరం పీఏసీఎస్ అధికారులను నిలదీశారు. శనివారం సంఘ డైరెక్టర్లు 8 మంది కలిసి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న రుణమాఫీ కాని 66 మంది రైతులు అక్కడికి చేరుకొని సీఈఓతో వాగ్వివాదానికి దిగారు. చైర్మన్ నలజాల శ్రీనివాసరావు ఈ సమావేశానికి ఎందుకు రాలేదని సంఘం సిబ్బందిని, డైరెక్టర్లను ప్రశ్నించారు. రుణమాఫీ విషయం తేలేంత వరకు సీఈఓ, కంప్యూటర్ ఆపరేటర్‌ను సస్పెండ్ చేయవద్దని రైతులు కోరారు. చైర్మన్, సీఈఓ ఇద్దరు కలిసి తమకు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమతో పాటు రుణాలు తీసుకున్న రైతుకు మాఫీ జరిగిందని తిరిగి వారు కొత్త రుణాలు కూడా తీసుకుంటున్నారని వాపోయారు. రెండేళ్లక్రితం రుణం తీసుకున్నా తమ పేరు రుణమాఫీ కోసం ఎందుకు పంపలేదని బీక్యాతండాకు చెందిన మహిళా రైతు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కుర్చీలను కిందపడేసి నిరసన వ్యక్తం చేసింది. రైతులు సంఘం సిబ్బందిని చుట్టుముట్టి నిలదీశారు. వర్షంలోనే కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడి నిరసనను విరమింపజేశారు.



మట్టపల్లి ఆలయంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మిసమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, నిత్యహోమం పూర్తిచేసి శ్రీమూల విరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల సంవాదం రక్తిగట్టించారు. అనంతరం నిత్యకల్యాణాన్ని వేదమంత్రోచ్ఛరణలతో వైభవంగా నిర్వహించారు. నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి, వంశీకృష్ణమాచార్యులు, ఆంజనేయాచార్యులు, ఆలయ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు పాల్గొన్నారు.



మట్టపల్లి ఆలయంలో నిత్య కల్యాణంలో భాగంగా తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

క్లుప్తంగా

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం

తిరుమలగిరి (తుంగతుర్తి): గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన తిరుమలగిరి మండలం బండపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. బండ్లపల్లి గ్రామానికి చెందిన చెరుకు సైదులు ఇంట్లో శుక్రవారం రాత్రి వంట చేసి గ్యాస్ ఆఫ్ చేయలేదు. కరెంట్ పోవడంతో ఇంట్లో కొవ్వొత్తి వెలిగించి బయటకు వెళ్లారు. అందరూ బయట ఉన్న సమయంలో సిలిండర్ పేలడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు, సెల్‌ఫోన్, బీరువా మొత్తం కాలిబూడిదయ్యాయి. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం


సైదులు (ఫైల్)

ఆత్మకూర్(ఎస్): ట్రాన్స్‌ఫార్మర్ ఆన్ చేస్తుండగా కరెంట్ వైరు తెగి మీద పడి రైతు మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని కందగట్ల గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కందగట్ల గ్రామానికి చెందిన మంచాల సైదులు(62) తన వ్యవసాయ బావి వద్ద పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ అయ్యి ఉండడంతో దానిని ఆన్ చేస్తుండగా.. కరెంట్ వైరు తెగి అతడి మీద పడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి సైదులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆ ఇంటి దీపాన్ని కాటేసిన పాము


పవిత్ర (ఫైల్)

చందంపేట: పాముకాటుతో చిన్నారి మృతిచెందింది. ఈ ఘటన చందంపేట మండలం పాగిళ్ల గ్రామంలో శనివారం జరిగింది. పాగిళ్ల గ్రామానికి చెందిన కరంటోతు కిషన్, గంగ దంపతుల కుమార్తె పవిత్ర(5) ఇంట్లో నిద్రించగా.. శనివారం తెల్లవారుజామున పాము కాటువేసింది. చిన్నారి ఏడుస్తుండడంతో తల్లిదండ్రుల కడుపు నొప్పి అని భావించారు. తీరా ఇంట్లో పాము కనిపించడంతో పాము కాటువేసినట్లు గుర్తించి చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

చెరువులో పడి..


రాజమ్మ (ఫైల్)

తిరుమలగిరి (తుంగతుర్తి): ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందింది. ఈ ఘటన తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో శనివారం జరిగింది. వెలిశాల గ్రామానికి చెందిన బుర్రి రాజమ్మ(53) గేదెలను మేపడానికి గ్రామంలోని ముత్యాలమ్మ చెరువు దగ్గరకు వెళ్లింది. గేదెలు మేత మేసుకుంటూ చెరువు లోపలికి వెళ్లగా వాటిని బయటకు తోలేందుకు ఆమె నీటిలోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి చనిపోయింది. స్థానికులు గమనించి మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీశారు.

నేడు బుద్ధవనానికి బైక్ ర్యాలీ


నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం

నాగార్జునసాగర్: తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ(టీజీటీడీసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బైక్ రైడర్స్ ఆదివారం 'రైడ్ టు నిర్వాణ' పేరిట నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. ప్రకాశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజా నుంచి ఆదివారం ఉదయం 7గంటలకు బైక్ ర్యాలీని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, పర్యాటక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీ బుద్ధవనానికి మధ్యాహ్నం 12గంటలకు చేరుకుంటుందని, అనంతరం వారు బుద్ధవనాన్ని సందర్శిస్తారని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి


ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

శాలిగౌరారం: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాలిగౌరారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవన్‌లో శనివారం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన డిమాండ్లతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీళ్ల పేరుతో నిధులు మాయం చేసి ఉద్యోగ నియామకాలకు మంగళం పాడిందన్నారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేసి పరోక్షంగా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల ఆర్థిక దోపిడీకి సహకరించిందన్నారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర మహోన్నతమైనదన్నారు. అనంతరం మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 18 మందిని పూలమాలలు, శాలువాలు, మెమొంటోలతో ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సంఘాల నేతృత్వంలో ఎంపీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయ సంఘాల మండల ప్రతినిధులు, మండల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- భర్త వివాహేతర సంబంధాన్ని ప్రశ్నించినందుకే చంపారంటూ మృతురాలి తల్లిదండ్రుల ఆరోపణ


కుమారుడితో కరుణ (ఫైల్)

శాలిగౌరారం: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతిచెందిన ఘటన శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆకారం గ్రామానికి చెందిన సూరారపు రాజుకు నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలుకు చెందిన మాతంగి నర్సయ్య కుమార్తె కరుణ(24)తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాజు మరో యువతితో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో రాజు, కరుణ మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టగా.. పద్ధతి మార్చుకోవాలని పెద్దమనుషులు రాజుకు సూచించారు. కానీ రాజు ఆ యువతిని పెళ్లి చేసుకుంటానని కరుణను వేధించేవాడు. ఇదే విషయమై వారం రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కరుణ తండ్రి మాతంగి నర్సయ్యకు రాజు ఫోన్ చేసి కరుణ నిద్ర మాత్రలు మింగి మృతిచెందినట్లు చెప్పాడు. వెంటనే ఆకారం గ్రామానికి వచ్చిన కరుణ తల్లిదండ్రులు ఆమె విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి లబోదిబోమన్నారు. శనివారం ఉదయం కరుణ మృతదేహాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తండ్రి ఆమె మెడ, ఛాతిపై కమిలి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాజు వివాహేతర సంబంధానికి తన బిడ్డ అడ్డుగా ఉందనే ఉద్దేశంతోనే హత్య చేశారని కరుణ తండ్రి ఆరోపించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం రాత్రి వరకు కరుణ మృతదేహానికి పోస్టుమార్టం జరుగకపోవడం, మృతురాలి తల్లిదండ్రులు అందుకు అంగీకరించకపోవడం గమనార్హం.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులది సమాన బాధ్యత

- పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య


కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామన్నపేట: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సమాన బాధ్యత తీసుకోవాలని పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య అన్నారు. రామన్నపేట మండలంలోని వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి క్రమశిక్షణ చాలా అవసరమని అన్నారు. పిల్లల చదువు, ప్రవర్తనపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. అనంతరం కూరెళ్ల విఠలాచార్యను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పల్లె మోహన్‌రెడ్డి, దాతలు తూటి మురళీధర్, ఇడెం శ్రీనివాస్, ఏఏపీసీ చైర్మెన్ పులగం సులోచన, మాజీ చైర్మన్ కర్రె రాజు, ఉపాధ్యాయులు ఇట్టె సోమిరెడ్డి, ఉయ్యాల భిక్షమయ్య, దూదిగాల సువర్ణ, మందుగుల వెంకటయ్య పాల్గొన్నారు.

నెస్ట్స్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా డాక్టర్ శరత్


అడవత్ శరత్

మిర్యాలగూడ: కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న జాతీయ గిరిజన విద్యార్థుల విద్యా సంఘం(నెస్ట్స్) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా దామరచర్ల మండలం పర్తునాయక్‌తండాకు చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అడావత్ శరత్ నియమితులయ్యారు. సంవత్సరం పాటు శరత్ ఈ కమిటీలో సభ్యుడిగా కొనసాగనున్నారు. నెస్ట్స్ స్వయం ప్రతిపత్తి సంస్థ కాగా గిరిజన జనాభా అధికంగా ఉండి అక్షరాస్యత దిగువన ఉన్న ప్రాంతాల్లో విద్యావ్యవస్థను బలోపేతం చేయడం, ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యనందించడం ప్రధాన ఉద్దేశ్యం. ఈ సందర్భంగా శరత్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

పరుగు పందెంలో బంగారు పతకం


బంగారు పతకంతో అప్పల వరుణ్

మోతె: మండల కేంద్రానికి చెందిన అప్పల వరుణ్ ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన తెలంగాణ అథ్లెటిక్స్ పోటీల్లో 60 మీటర్ల పరుగు పందెం(అండర్-16)లో బంగారు పతకం సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వరుణ్ కోదాడ పట్టణంలో ఎస్‌ఆర్‌ఎం పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. వరుణ్‌ను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు ప్రాణం తీసిన గేదె

- చెరువులోకి లాక్కోని వెళ్లడంతో మృతి


రామనర్సయ్య (ఫైల్)

మోత్కూరు: గేదె రైతు ప్రాణం తీసింది. ఈ ఘటన మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పాటిమట్ల గ్రామానికి చెందిన రైతు నాగపూరి రామనర్సయ్య(65) తన గేదెను తోలుకొని వస్తున్నాడు. గ్రామ చెరువు దగ్గరకు రాగానే రైతు చేతికి గేదె తాడు కట్టుకొని ఉన్నాడు. ఆ సమయంలో గేదె ఒక్క ఉదుటున రామనర్సయ్యను గుంజుకొని చెరువులోకి లాక్కెళ్లడంతో నీటిలో మునిగి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

సాగర్‌ను సందర్శించిన భూటాన్ అధికారులు


బుద్ధవనంలో బుద్ధుడి విగ్రహం వద్ద భూటాన్ దేశ పోలీస్ అధికారులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని భూటాన్ దేశ పోలీస్ అధికారుల బృందం శనివారం సందర్శించారు. భూటాన్ పోలీస్‌శాఖ డిప్యూటీ చీఫ్(ఫైనాన్స్) వాంగ్‌చుక్లా, పోలీస్ ఉన్నతాధికారి ఉగ్వేన్‌రిక్‌జిన్ నేతృత్వంలో ఆరుగురు పోలీస్ అధికారులు హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్‌పటేల్ పోలీస్ అకాడమీలో ప్రత్యేక శిక్షణ పూర్తి చేసుకున్నారు. అనంతరం సాగర్ సందర్శనకు వచ్చారు. మహాస్తూపం చుట్టూ ఉన్న బౌద్ధ శిల్పాలు, మహాస్తూపంలో గల బుద్ధధాతు పేటికలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచ శాంతికి, మానసిక ప్రశాంతతకు బుద్ధవనంలోని మహాస్తూప సందర్శన చక్కటి మార్గదర్శకంగా ఉందన్నారు. అనంతరం నాగార్జునకొండకు వెళ్లారు. అక్కడ మ్యూజియంతో పాటు సింహళ విహారం, స్తూపాలు, చైత్యాలు, బోధి వృక్షం తదితర వాటిని సందర్శించారు. వీరికి చారిత్రక ప్రాధాన్యత గురించి పర్యాటక గైడ్ సత్యనారాయణ వివరించారు.

పిడుగుపాటుతో వ్యక్తి మృతి


జంగయ్య (ఫైల్)

చింతపల్లి: పిడుగుపాటుకు గురై వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం చింతపల్లి మండలం వింజమూరులో జరిగింది. వింజమూరు గ్రామానికి చెందిన యాచారం జంగయ్య(42) వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తన పొలంలో సాగుచేసిన దొండకాయలు తెంపేందుకు వెళ్లగా మధ్యాహ్న సమయంలో మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో పిడుగుపాటుకు గురై మృతిచెందాడు. చుట్టుపక్కల పొలాల వారు గమనించి మాల్ వెంకటేశ్వరనగర్ లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

చిలుకూరులో మూడు పాడి గేదెలు...

చిలుకూరు: పిడుగుపాటుకు గురై రెండు పాడి గేదెలు మృతిచెందాయి. ఈ ఘటన శనివారం చిలుకూరు గ్రామంలో జరిగింది. చిలుకూరు గ్రామానికి చెందిన కొండా ఎల్లయ్య తన ఇంట్లో చెట్టు కింద రెండు పాడి గేదెలు కట్టేయగా.. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి పిడుగు పడి మృతి చెందాయి. మృతిచెందిన పాడి గేదెల విలువ రూ.1.60లక్షలు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

ముగ్గురు దొంగల అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఎస్. రాజు

డిండి: ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేస్తున్న ముగ్గురు దొంగలను శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు వివరాలను డిండి పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎస్. రాజు విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన అదుర్ల సందీప్ తన వ్యవసాయ పొలంలో ఉంచిన ట్రాక్టర్ ట్రాలీ ఈ నెల 4వ తేదీన చోరీకి గురైంది. 9వ తేదీన సందీప్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా కామేపల్లి గ్రామానికే చెందిన మాధవరం సంపత్‌రావుపై అనుమానంతో అతడిని విచారించగా.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం గట్టుతుమ్మన్ గ్రామానికి చెందిన బొలగం శ్రీను, అచ్చంపేటకు చెందిన కడారి బాబును కామేపల్లికి పిలిపించి శ్రీనుకు సంబంధించిన ట్రాక్టర్ ట్రాలీని తానే చోరీ చేయించానని సంపత్‌రావు ఒప్పుకున్నాడు. అచ్చంపేటలో దాచిన ట్రాక్టర్ ట్రాలీని అమ్మడానికి కడారి బాబు శనివారం దేవరకొండ వైపు వస్తుండగా.. డిండి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. శ్రీను, బాబును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరు రెండు నెలల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం పర్వతగిరి గ్రామంలో కూడా ట్రాక్టర్ ట్రాలీని చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ మేరకు రెండు ట్రాక్టర్ ట్రాలీలతో పాటు రెండు ఇంజన్లను సీజ్ చేసి సంపత్‌రావు, శ్రీను, బాబును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉస్సేన్, రవి తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శేఖర్ (ఫైల్)

వేములపల్లి (మాడ్గులపల్లి): బైక్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మాడ్గులపల్లి మండల కేంద్రంలో అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామ పరిధిలోని మలపరాజుగూడేనికి చెందిన పుట్ట శేఖర్ (32) బైక్‌పై మండల కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌కు వెళ్లి క్యాన్‌లో డీజిల్ పోయించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా.. మాడ్గులపల్లి మండల కేంద్రంలో నార్కట్‌పల్లి-అద్దంకి రహదారిపై వెనుక నుంచి డీసీఎం వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య మనీషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు. మృతుడికి పాప, బాబు ఉన్నారు. డీసీఎం డ్రైవర్ నిజాంఖాన్ అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

చివరి భూములకు నీరందించాలని రైతుల ఆందోళన


కాల్వలోకి దిగి ఆందోళన చేస్తున్న రైతులు

వేములపల్లి(మాడుగులపల్లి): డీ-37 కాల్వ నుంచి తమ భూములకు నీరు అందక పంట పొలాలు ఎండిపోతున్నాయని మాడుగులపల్లి మండలంలోని గోపాలపురం, కన్నెకల్, కేశవాపురం, మాచినపల్లి గ్రామాల రైతులు శనివారం కాల్వలోకి దిగి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చివరి భూములకు నీరందే విధంగా కాల్వ నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలని ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అధికారుల నిర్లక్ష్యంతో వరి పొలాలు, బత్తాయి తోటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ ఉన్నతాధికారులు స్పందించి చివరి భూములకు నీరందే విధంగా చూడాలని, గ్రామాల్లోని చెరువులను డీ-37 కాల్వ ద్వారా నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రమేష్‌రెడ్డి, బోడ యాదయ్య, శంకర్, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, కొండలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


జతీన్‌యాదవ్

పెద్దవూర: మండలంలోని నాయినివానికుంట గ్రామానికి చెందిన నడ్డి బాలరాజ్, అంజలి దంపతుల కుమారుడు జతీన్‌యాదవ్ అండర్-19 విభాగంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 14న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో నిర్వహించిన రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి సీబీఎస్‌ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు వేల మీటర్లు(ఐదు కిలోమీటర్ల) పరుగు పందెం(అండర్-19)లో రెండో స్థానంలో నిలిచిన సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో అక్టోబర్ 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో జరగనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు.

ఎల్-11 కెనాల్ తూము షట్టర్ ధ్వంసం

తిప్పర్తి: మండలంలోని యర్రగడ్డలగూడెం సమీపంలో డి-40కాలువ పరిధిలోని ఎల్-11 సబ్ కెనాల్ వద్ద తూము షట్టర్‌ను నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామ రైతులు ధ్వంసం చేసినట్లు ఐబీ ఏఈ శివప్రసాద్ తెలిపారు. షట్టర్ ధ్వంసం చేసిన వారిపై శనివారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తూంకు ఉన్న షట్టర్‌ను ధ్వంసం చేయడం ద్వారా నీటి ప్రవాహం ఎక్కువై కాలువ పొంగిపొర్లుతుందన్నారు.

ఇద్దరు వ్యక్తుల రిమాండ్

కనగల్: అనుమతులు లేకుండా ఇసుక తరలించిన కేసులో కోర్టు పేషీలకు హాజరుకాని ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ పి. విష్ణుమూర్తి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనగల్ మండల కేంద్రానికి చెందిన నీలకంఠం ధనుంజయ, నక్క జగన్‌కు అనుమతులు లేకుండా ఇసుక తరలించిన కేసులో కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేయగా వారిని జడ్జి ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ.. ఇద్దరికి గాయాలు

హాలియా: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తల్లి, ఏడు నెలల పాపకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హాలియా పట్టణంలో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలంలోని బొక్కమంతలపాడు గ్రామానికి చెందిన గ్యారా విక్రమ్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం తన భార్య శివరాణి, ఏడు నెలల పాపతో కలిసి విక్రమ్ బైక్‌పై పెద్దఅడిశర్లపల్లిలోని తన అత్తగారింటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో హాలియా పట్టణంలోని శివాజీ విగ్రహం వద్ద వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివరాణి తొంటి విరగగా, పాప రెండు కాళ్ల పైనుంచి లారీ వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనంలో నల్లగొండకు తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

బైక్ ఢీకొని..


చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ రాములునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం గుడూరు గ్రామ సమీపంలోని రైస్ మిల్లు వద్ద రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామం నుంచి మిర్యాలగూడ వైపు బైక్‌పై వస్తున్న పరంగి మధుబాబు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి తలకు గాయాలయ్యాయి. అతడి 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి మానసికస్థితి సరిగ్గా లేదని పోలీసులు భావిస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పాక రాజశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మధుబాబుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

మహిళా సంఘాల నిర్వహణ భేష్

- కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అడిషనల్ సెక్రటరీ అనిల్‌కుమార్



మహిళా సంఘాల పనితీరును అడిగి తెలుసుకొంటున్న అడిషనల్ సెక్రటరీ టీకే అనిల్‌కుమార్

భూదాన్‌పోచంపల్లి: మహిళా సంఘాల నిర్వహణ భేషుగ్గా ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ టీకే అనిల్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ అనితారామచంద్రన్, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక కమిషనర్ షఫీవుల్లా, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పురం గ్రామాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వయం సహాయక మహిళా సంఘాలతో సమావేశమై బ్యాంకుల ద్వారా తీసుకుంటున్న రుణాలను వినియోగించుకొని ఏ విధంగా స్వయం సమృద్ధి సాధిస్తున్నారని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కుటుంబ నిర్వహణ మొదలుకుని ఏదైనా రంగంలో సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగామని సంఘబంధం నాయకురాలు ప్రత్యూష చెప్పడంతో అధికారులు ఆమెను అభినందించారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ కార్మికులకు సన్మానించారు. అదేవిధంగా జలాల్‌పురంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను సందర్శించారు. సంస్థ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎంతమందికి యువతకు శిక్షణ ఇచ్చారని, ఎంత మందికి స్వయం ఉపాధి, ఉద్యోగాలు కల్పించారని సంస్థ డైరెక్టర్ లక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. సంస్థ డైరెక్టర్, ఫ్యాకల్టీలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గంగాధర్, జాయింట్ కమిషనర్ నర్సింహులు, ఎస్‌బీఎం డైరెక్టర్ సురేశ్‌బాబు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జెడ్పీ సీఈఓ శోభారాణి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, డీటీ నాగేశ్వర్‌రావు, ఎంపీఓ మాజిద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీని పకడ్బందీగా అమలు చేయాలి

చౌటుప్పల్ రూరల్: మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అడిషనల్ సెక్రటరీ టీకే అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ కమిషనర్ అనితారాంచంద్రన్‌తో కలిసి చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామంలో ఉపాధి హామీ పనులు పరిశీలించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన హార్టికల్చర్ పండ్ల తోటను సందర్శించారు. అనంతరం చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బంది మస్టర్ జనరేట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ గంగాధర్, జిల్లా ముఖ్యకార్యదర్శి ఎన్.శోభారాణి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, అడిషనల్ పీడీ సురేష్, డివిజనల్ పంచాయతీ అధికారి ప్రతాప్‌నాయక్, ఇన్‌చార్జ్ ఎండీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ అంజిరెడ్డి, ఏపీఓ ఈశ్వరయ్య పాల్గొన్నారు.